

8

వివినమూర్తి

# స్వప్నగంధ

'నేనురా - నరేంద్రపురం - రామాన్ని' మళ్ళీ గుర్తు చేసాను. ఎదురుగా ఎస్.టీ.డీ. ఫోనులో పైసలు జోరుగా పెరిగిపోతున్నాయి. లండీకొడుకు - గుర్తుపట్టక కాదు. నాటకం. చిట్ట చివరకి గుర్తు ఫట్టానని ఒప్పించీసరికి పన్నెండు రూపాయలు కృష్ణార్పణం.

'చెప్పు - ఎలా ఉన్నావు - ఇన్నాళ్ళ తర్వాత నేనెలా గుర్తొచ్చాను ?'

రకీమని చెపితే నాపని అయినట్లే. అలాగని బాగా తాత్సారం చేస్తినా జేబు ఖాళీ ? తిప్పి తిప్పి చెప్పాను. ఆహా ః - అలాగా అంటున్నాడు కాని రమ్మన్నముక్క పెదవి దాటటం లేదు.

'తిన్నగా నీ యింటికే వస్తాను. నిన్ను చూసినట్టూఅవుతుంది. నీ యింటికి ఎలా రావాలో చెప్పు' - అన్నాను.

లాభం లేకపోయింది. వచ్చి తీసుకువెళ్తా ననలేదు. పైగా పెళ్ళాం ముండ ఇంట్లో లేదుట.

'అయితే - యింకేం - మనమే ఉడకేసుకో వచ్చు. గుర్తుందా - కోనసీమ వచ్చినపుడు నేన్నీకు చేసి పెట్టినవంట. కందిగుండ - ఆవకాయ - ఉల్లిపాయ ముక్కలూ....' నా నవ్వుగాని, చనువు నింపిన గొంతు గాని, జ్ఞాపకం చేసిన గత స్మృతులు గానీ... గేదెమీద కురిసిన వాన చందమయి పోయాయి. అయినా మనపని ముఖ్యం. చివరకి చిరునామా చెప్పాడు. చెప్పక చస్తాడా - స్నేహ మంటూ ఒకటి ఏడిసాక -

✿ ✿ ✿

హైదరాబాదు వచ్చి మూడు రోజు లయింది. శేషగిరిగాడి కొంప పెద్ద భోషాణమంత ఉంది. పైన ఉంటున్నాడు. కింద వాటాలు పదివేలు తెచ్చిపోస్తున్నాయిట. ఇన్నోవా కారు వీడికి. రేవాకారు - లక్కపిడతంత ఉంది - పెళ్ళానికి. ఇంత ఉండీ కక్కుర్తి. కట్టుకుపోతాడు సంపాదించినదంతా. అయ్యో పాత స్నేహితుడు - రాక రాక వచ్చాడు. కారుంది- డ్రైవరున్నాడు - తిరగడానికి తీసుకెళ్ళరా - అనొచ్చుగదా ! లేదు. ఎందుకంటాడూ - ? పిల్లలిద్దరూ అమెరికాని దోచేస్తున్నారు. వీడు ఇక్కడ మేడలు లేపేస్తున్నాడు.

తప్పదు. పని మనది. వాడెలాంటి మాదు మొహంవాడయినా - చంద్రబింబమనక తప్పదు. వసుదేవుడంతటివాడు గాడిద కాళ్ళు పట్టలేదా ?

✿ ✿ ✿

మూడ్రోజులు వాడిమీదెక్కి నేనుఊరేగానో... నా మీదెక్కించుకుని వాడిని ఊరేగించానో.... ఆ భగవంతుడికి తెలియాలి. సెక్రటేరియట్‌లో పని చేసి రిటైరయినాడు గదా - తీసుకువెళితే పనవుతుందని ఆశపడ్డాను. అబ్బే - కదలలేదు. ఎవరెవరివో పేర్లు చెప్పాడు. తనపేరు చెప్పమన్నాడు. అలాగే చెప్పాను. తిరిగాను.

మా వెధవకి ఏ యింజనీరింగులోనో సీటు దొరికుంటే నాకీ పాట్లు ఉండేవి గావు. బంగారు యిటికల్తో గోడలు కట్టించేవాడిని. నరేంద్రపురం మొత్తం టోకున కొనేసేవాడిని. ఇంకానయమే - ఆ డిగ్రీ అయినా కొట్టుకొచ్చాడు. వాడికీ ఫారెస్టు డిపార్టుమెంటు నౌఖరీ కిట్టించేద్దునా - కడుపులో చల్ల కదలక్కరలేకుండా గడిచిపోతుంది. ఇంకా నయమే ఆ డిగ్రీ పట్టా అయినా పట్టుకువచ్చాడు. ఆ నౌఖరీ వచ్చిందా ఇలాంటి మిత్రద్రోహులని ముడ్డిచుట్టూ మూడుమార్లు తిప్పి విసిరేసేవాడిని.

నా సహనం ఫలించింది. ఆ రోజు బావర్చి హోటల్లో మింగుతుంటే ఓ గడ్డిపోచ దొరికింది. చాలు దానినే పేనాను. వాడి చెల్లెలు రామలక్ష్మిని ఆ మధ్య రావులపాలెం బస్టాండులో కలవటమూ.... ఆ మనిషి ఇంత మొహం చేసుకుని నన్ను పలకరించి మాట్లాట్టమూ యదాలాపంగా చెప్పాను. రక్త సంబంధం సినిమా లేదూ అందులో ఎన్టీవోడిలా అయిపోయాడు.

విషయం రాబట్టాను.

రామరామ ! ఆ పిల్ల ఎవరో మాలాడిని కట్టుకుని యింట్లోంచి వెళ్ళిపోయింది. కట్టుకుందని అన్నాడు గాని నాకు నమ్మకం లేదు. లేచిపోయే ఉంటుంది. మొగుడూ పెళ్ళాం ఇద్దరూ టీచర్లట. అమలాపురంలో ఎక్కడో ఉంటున్నారుట. ఏదో వాళ్ల బతుకు వాళ్ళు బతుకుతున్నారుట. ఎందుకు బతకరూ- ప్రభుత్వదత్తపుత్రులు గదా - అన్నాను నోరుజారి. వెధవ నాలిక తిన్నగా ఉండదు గదా - ఆ పళంగా తారాజువ్వలా లేచిపోయాడు. 'ఆ జ్ఞానం ఆ పెద్దమనిషికి ఉంటే బాగుండును' అన్నాడు. పిల్లలిద్దరూ మెరిట్ స్టూడెంట్లుట. అయితే మాత్రం - అవకాశం ఉన్నపుడు ఎందుకు వాడుకోరాదూ - అని అడిగాడుట వీడు. దానికతను ఒప్పుకోలేదుట. నువ్వు డబ్బు అప్పిస్తావేమోనని వచ్చాను గాని - నీ సలహా కోసం రాలేదన్నాడుట. మాటా మాటా పెరిగిందిట. నువ్వు అలాంటి కులంలో పుట్టినా అణకువ రాలేదన్నాట్ట ఆవేశంలో. అప్పట్నించీ ఆ చెల్లెలితో ఉన్న కాస్త లింకూ తెగిపోయిందిట. అదీ ఈయన గారి ఏడుపు.

గ్లాసు మీద గ్లాసు లాగేస్తున్నాడు.

ఈ నియ్యోగప్పీనుగలకి ఆచారాలు లేవు వ్యవహారాలు తప్ప. అంతా జగన్నాథం చేసి పారేస్తున్నారు. మరొహాళ్ళూ మరొహాళ్ళూ అయితే ఆ పిల్ల చచ్చిందని దణ్ణం పెట్టి ఊరుకొనేవారు. ఆటయింలో ఏం ఏడిసారో తెలీదు గాని. తర్వాత్తర్వాత రహస్యంగానో బహిరంగంగానో చెల్లెలుతోటీ బావగారితోటీ సంబంధం పెట్టుకున్నాడు గాబోలు - ! అప్పివ్వాల్సివస్తుందని రిజర్వేషన్ సీటు తెచ్చుకోలేకపోయావా - అని అడిగినట్టున్నాడు - నియ్యోగపాడు కదా - లౌక్యం వెలగబెట్టాడుగాబోలు - ! అవతలాడు 'నీకెందుకయ్యా - ' అని నిజరూపం చూపించేసరికి ఈయనగారికి చచ్చిపోయిన బ్రాహ్మణ్యం గుర్తుకొచ్చిందిగాబోలు!

అంతా అర్ధమయింది.

కాని అర్ధమయినట్టు ఉండకూడదు. మనం నించున్నకొమ్మ మనమే నరుక్కోకూడదు దొరికిందాన్ని బాగా పేనాలి. మనం ఒడ్డున పడాలి. వాడు ధర్మమన్నదాన్ని పరమధర్మం అనాలి. తాన అంటే తందాన అనాలి.

అలా విడిపోయిన ఆ సావిత్రి ఎంటీ రామారావుల్ని నేను కలపాలిట. బావుంది నాయనా - ఆ మాలాళ్ళ యిళ్లకి వెళతాను. నీ చెల్లెలు చేసిపెట్టిన కక్కా ముక్కా అమ్మక్కగా తింటాను. నీబావ

**మాటలకేం - బహు తియ్యగా మాట్లాడేడు. 'అయ్యో-పాపం - పేదోడా ?' అన్నాడు. 'మనచేతుల్లో ఏముందండీ - మీరూ సర్వీసు చేసారు. రూల్సన్నీ మీకు తెలుసు' అన్నాడు. పస్తాయించి పస్తాయించి శేషుగాడు పాడి వేసాడు' ఎవరి రుణమూ ఉంచుకోడండీ - వాడి పాట్లేవో వాడు పడతాడూ' అన్నాడు.**

కాళ్ళు పడతాను. మీకు రాజీ చేస్తాను - అలాగే తండ్రీ - అలాగే - అనుకున్నాను.

'అదెంతపనిరా-తప్పకుండానూ -' అన్నాను.

పడిపోయాడు-ఆ రోజు బిల్లువాడే కట్టేసాడు 'ఇప్పుడు చెప్పరా రాము! నీ పనేమయింది?'

✿ ✿ ✿

ఏదో అనుకున్నాను గాని - నియ్యోగి నియ్యోగే. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే బిడ్డట. నాకు కాలం కలిసొచ్చింది.

గవర్నమెంటు ఉద్యోగమంటే ఓ అర ఎకరం ఖర్చవుతుందని ముందే తెలుసు. సిద్ధపడే వచ్చాను. ఆ ఎకరం మీద రాబడి కన్నా దీనిమీద నుంచి ఎక్కువ లాగొచ్చు. ఎవరిని పట్టాలి? ఎవరిచేతిలో పెట్టాలి? అందులో ఎంత మిగుల్చుకోగలం? అదీ సమస్య. తీరా హైదరాబాదు వచ్చీసరికి కథంతా తారుమారయింది. శేషుగాడి దగ్గర పుడ్డూ బెడ్డూ రాబట్టగలిగాను గాని సెక్రటేరియట్‌కి వీడిని కదిలించ లేకపోయాను. అయిదుకాదు ఆరు లకారాలు పొయ్యా లిట. అవి వెళ్ళాల్సిన వాళ్ళ బొజ్జల్లోకి వెళతాయి. వాళ్లంతా కలిసి ఉమ్మడిగా కజమాయిస్తే మా వెధవకి నౌఖరీపుడుతుందిట. లోకధర్మం - తప్పుతుందా - అయితే ఈ పని నమ్మకంగా ఎవడు చేస్తాడు ?

మావాడు నా గోడంతా విన్నాడు. రెండు రోజుల్లో సమాచారం పట్టేసాడు. 'పద ! పోదాం-' అన్నాడు.

✿ ✿ ✿

సెక్రటేరియట్‌లో మారుమూల ఉందాగది. ఆ గదిలో ఉన్నాడా పెద్దమనిషి. పెద్దమనిషేంటి - పిచ్చి మనిషి. ఆ గదికి గోడలు లేనట్టూ - ఉన్నా వాటినిండా చెవులు కెమేరాలూ ఉన్నట్టు వణికి పోతుంటాడు. చెప్పేవాళ్ళంతా చెప్పనే చెప్పారు. గడ్డివాముకాడ కుక్కట. నీతికినిలబెట్టిన జండాట. అంత నీతిమంతుడైతే - నా కొడుక్కి ఆ ఉద్యోగం యివ్వరాదూ -! యివ్వడు. అన్ని పరీక్షలూ ఒకేమారు పాసవకుండా దపదపాలుగా పూర్తిచేసాడని మా వాడి కాగితం మీద కూర్చుండిపోయాడు. అక్కడ నుంచి ముందుకు కదిలితే - మిగిలింది నేను చూసుకుంటాను అన్నాడు మా ఎమ్మెల్యే. రెండు వరకూ యిస్తాం అనిచెప్పాం. ఆడు కదలటం లేదు. కరగటం లేదు. నా వంతుకు వచ్చిన ఈ పోస్టుమీద నాకేదో నోరు తడుస్తుందని నేను అనుకున్నాను. నువ్వాణ్ణి కదిపావా - కరిగించావా - నాలుగింటితో మీ పనయిపోతుంది శాస్త్రిగారూ-' అని చేతులెత్తేసాడు చంకనాకమన్నట్టు.

ఆ పిచ్చాడు మాత్రం కదలటం లేదు. డైరెక్టుగా వాడి గదిలోకి తీసుకుపోయాడు మా వాడు !

మాటలకేం - బహు తియ్యగా మాట్లాడేడు. 'అయ్యో-పాపం - పేదోడా ?' అన్నాడు. 'మనచేతుల్లో ఏముందండీ - మీరూ సర్వీసు చేసారు. రూల్సన్నీ మీకు తెలుసు' అన్నాడు. పస్తాయించి పస్తాయించి శేషుగాడు పొడి వేసాడు' ఎవరి రుణమూ ఉంచుకోడండీ - వాడి పాట్లేవో వాడు పడతాడూ' అన్నాడు.

దానికా పిచ్చిమనిషి తోక తొక్కిన తాచులా లేచాడు - 'నేనెవరినను కుంటున్నారు? మీరు బ్రాహ్మలే కావచ్చు. మీకంటే నీతీజాతీ లేకపోవచ్చు. నేను దళితుడినే కావచ్చు. నాకు నీతుంది. నా జాతికీ ఈ రోజున నీతుంది' అన్నాడు అగ్గినిప్పుకణికెలా మండిపడుతూ.

నాకు చెమటలు పట్టేసాయి. నిన్నటి వరకూ కూటికి లేకుండా కట్టుకోటానికి సరైన బట్టలేకుండా అఘోరించిన ఈ జాతివాడు కూడా నీతీ గీతీ అనడమేంటి కలికాలం కాకపోతే - ?

'క్షమించాలి - మీరు గెటౌట్ అనక్కరలేదు. మేమే వెళ్ళిపోతాం' అంటూ మా వాడు కాస్త ఆయాసపడుతూ 'కొంచెం మంచినీళ్ళు యిస్తారా?' అన్నాడు.

ఇచ్చాడు.

ఇస్తున్నప్పుడు వాడిమొహం చూడాలి. తీసుకుంటున్నప్పుడు మా వాడిని చూడాలి. ఏ ఏక్టరూ చాలడు. మంచినీళ్ళు తాగాడు. కాస్సేపు గుండెలమీద రాసుకున్నాడు. కొంచెం సర్దుకున్నాక లేచాడు -

'ముప్పై ఎనిమిదేళ్ళు సర్వీసు చేసి రిటైరయాను. మీవంటి వారిని నేను చూడలేదు బెళగిరి గారూ ! చాలా సంతోషం 'అంటూ కరచాలనం చేసాడు. నాకు మండిపోతోంది. ఉన్న ఒక్క ఆశా పోయింది. వీడు వాడి చెయ్యి పట్టుకుని ఊపేస్తు న్నాడు.

చటుక్కున చెయ్యి వదిలి ఆ టేబిల్‌మీద ఉన్న పుస్తకాన్ని తీసుకుని 'స్వప్నగంధ' అని చదివాడు.

'మీకు కన్నడం వచ్చా ?' అన్నాడు బెళగిరి.

'ఈ పుస్తకం నంజొండ స్వామి చేతిలో చూసాను -"

'ఎవరు - ప్రొఫెసర్ నంజొండ స్వామి - రైతు నాయకుడు - "

"సాక్షాత్తూ ఆయనే -"

'ఆయన మీకు తెలుసా -'

'కన్నడ రైతులని ఆయన ఎలా ఏకతాటిమీదకి తీసుకువచ్చాడో - తెలుసుకుందామని ఆయన వ్యూహం యిక్కడ కూడా అమలు చేద్దామని నాకు తెలిసిన రైతు మిత్రులు నన్ను తీసుకుని ఆయన దగ్గరకు వెళ్ళారు ఒకమారు. నేనూ పదేళ్ళు కర్ణాటకలో పనిచేసాను.'

అక్కడనుంచి వాళ్ళిద్దరూ కన్నడంలోకీ, తెలుగులోకీ మార్చి మార్చి దిగిపోయారు. ఆ పిచ్చాడు బెళగిరి కల్యాణదుర్గం దగ్గర బోర్డరు ఊరివాట్ట. మాతృభాష కన్నడంట. కవిత్వం వెలగబెడతాడుట. 'స్వప్నగంధ' అన్న ఆ పుస్తకం వాడే రాసాట్ట. దానిగురించి నంజొండస్వామి ఏమన్నాడని- తెలుసుకోవాలని - ఆత్రం. తెలుగులోనే చెప్పండి అన్నాడు మావాడి అవస్త గమనించి - 'బెళగిరి గారూ ! ఇది చాలా అద్భుతమైన పుస్తకం. రాసినవాడి కులం అస్తిత్వం గుర్తుంచు కోకుండా చదవటమూ కష్టమే - రాయటం అంతకన్నా కష్టం. దాన్ని అంచనా వేయటమైనా వాటికి అతీతంగా సాగితే - ఈ స్వప్నగంధ వంటి పుస్తకాలు ప్రధాన స్రవంతి అవుతాయి. శతాబ్దాల భారత వర్ణ వ్యవస్థ అనాగరిక సంవేదనలలో నిజమైన నాగరిక సంవేదనలకు చోటు దొరకటానికి ఎన్నాళ్ళు పడుతుందో!' అంటూ చాలా చెప్పారు నంజొండ స్వామి." అంటూ వీడు చాలా చెప్పాడు.

నా ముడ్డికి నిప్పంటించి వీళ్ళిద్దరూ చలి కాగుతున్నట్టుంది నాకు.

కొంతసేపయాక - మా వాడు లేచాడు.

'ఈ పుస్తకం ఖరీదు ఎంత సార్ !' అని అడిగాడు మావాడు.

'మీరు కన్నడం చదువుతారా!' ఆశ్చర్యంగా అడిగాడు బెళగిరి.

'ఇది చదవటానికైనా-కన్నడం నేర్చు కుంటాను' అన్నాడు.

'తీసుకోండి సార్!' అంటూ పేరు అడిగి రాసి చేతిలో పెట్టాడు.

'కృతజ్ఞుడిని' అంటూ బయలుదేరుతూంటే -

'శేషగిరిరావుగారూ ! మీ అబ్బాయి పేరూ వివరాలూ రాసివ్వండి!' అన్నాడు బెళగిరి.

✿ ✿ ✿

ఇద్దరం ఇంటికి వచ్చాం.

స్వప్నగంధ వాడిటేబిల్ మీదకిచేరింది. అది ఎప్పుడో అప్పుడు పాత కాగితాలలోకి చేరుతుందని నాకు తెలుసు.

సంతోషంతో నేను బయలుదేరుతుంటే వాడు వాడి చెల్లెలు చిరునామా ఫోను నంబరు రాసిన కాగితం యిచ్చాడు.

మా వాడి కాగితం ముక్క నా చేతిలో పడేవరకూ ఈ 'స్వప్నగంధ' నా పర్సులో జేబులో భద్రంగా ఉండక తప్పదు.